సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



రూ.13 లక్షలకు టోకరా

జిల్లా కేంద్రానికి చెందిన ఓ బిల్డర్ రూ.13 లక్షలకు మోసపోయాడు. సిమెంట్ కొనుగోలులో మోసం జరిగింది. - 10లో



కన్నీటి తీరం

నాగావళిలో మునిగి ఓ బాలుడు మృతి చెందాడు. స్నానం కోసం దిగి మునిగిపోయాడు. - 10లో



క్రికెట్ అభిమానుల్లో ఉత్సాహం

వజ్రపుకొత్తూరు: భారత్–పాక్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా అభిమానుల్లో ఉత్సాహం రెట్టించింది. పూండిలో ప్రత్యేక స్క్రీన్ ఏర్పాటు చేసుకుని తిలకించారు. పాక్‌ను ఇండియా దీటుగా ఓడించడంతో స్వీట్ పంచుకుని సందడి చేశారు.

● సరదా తెచ్చిందయ్యా..

ఉత్సవ ఉత్సాహం ప్రారంభమైంది. ఊళ్లలో దసరా సరదా ఆరంభమైంది. శరన్నవరాత్రులు నేటి నుంచి ప్రారంభం కానుండడంతో అమ్మవారి ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆయా ప్రాంతాలు విద్యుత్ దీపాల అలంకరణలతో ధగధగమంటూ మెరిసిపోతున్నాయి. తొమ్మిది రోజుల క్రతువులో ప్రతి నిత్యం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.





పాతపట్నం: విద్యుత్ కాంతులతో అమ్మవారి ఆలయం (ఇన్‌సెట్లో) నీలమణిదుర్గ అమ్మవారు

● ఉత్సవానికి సిద్ధం

పాతపట్నం: నీలమణి దుర్గమ్మ ఆలయంలో నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు మొదలుకానున్నాయి. ఆలయంలో మొదటిరోజు ఉదయం కలశ స్థాపనం, విఘ్నేశ్వరపూజ, దేవ పుణ్యాహవచనం, దీక్షాదారణం, పరిషత్ ప్రాయశ్చిత్తం, అఖండ దీప స్థాపన, అంకురారోపణము, అగ్నిప్రతిష్ఠ, అమ్మవారి మూల మంత్రహోమాలతో పాటు ప్రత్యేక పూజలు యోగశాలలో నిర్వహించనున్నారని ఈఓ వాసుదేవరావు తెలిపారు.

● స్వేచ్ఛావతి సన్నిధిలో..

● నేటి నుంచే సంబరాలు మొదలు
● నిత్యం ఐదువేల మందికి అన్నప్రసాదం పంపిణీ



ఆలయంలో కొలువైన స్వేచ్ఛావతి అమ్మవారు

ఇచ్ఛాపురం: గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలు ఆదివారం నుంచే మొదలు కానున్నాయి. అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత. ఉత్సవాల్లో భాగంగా ప్రతి నిత్యం వేకువన 4 గంటలకే ఆలయ గర్భగుడిలో అమ్మవారికి అభిషేకాలు, తైల మర్దన, సింధూర మర్దన పూజా, అలంకరణ, సహస్ర నామార్చన, ప్రత్యేక హారతులను ఆలయ పూజార్లు నిర్వహిస్తారు. పది గంటల నుంచి హోమ మండపం వద్ద ప్రతిష్ఠించిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం ప్రాంగణంలో సుమారుగా 5వేలమందికి పైబడి భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తారు.





శ్రీకాకుళం ముత్యాలమ్మ తల్లి కోవెల వద్ద విద్యుత్ అలంకరణ



శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలి వద్ద విద్యుత్ అలంకరణలు



శ్రీకాకుళంలో విజయ దుర్గ అమ్మవారి ఆలయం వద్ద..

మన చేనేతకు ▶ అంతర్జాతీయ ఖ్యాతి



ఏఎఫ్‌కేకే సంఘంలో కాటన్ చీరలను పరిశీలిస్తున్న ఇన్వెస్ట్ ఇండియా సెంట్రల్ టీమ్ కమిటీ మెంబర్ ఆరాధన

● కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్:

ఒక జిల్లా–ఒక ఉత్పత్తి అవార్డుకు జాతీయ స్థాయిలో శ్రీకాకుళం జిల్లా ప్రాథమిక దశలో ఎంపికైందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ వెల్లడించారు. జాతీయ అవార్డు నామినేషన్ పరిశీలనలో భాగంగా ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందం సభ్యురాలు ఆరాధన శర్మ శ్రీకాకుళం జిల్లాకు శనివారం చేరుకున్నారు. తొలుత కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న కేంద్ర బృందం సభ్యురాలికి పుష్ప గుచ్ఛాలతో కలెక్టర్ అభినందనలు తెలిపారు. కేంద్ర బృందం కోఆర్డినేటర్ ఆరాధన శర్మ కలెక్టర్‌తో మాట్లాడారు. జిల్లాలో చేనేత ఉత్పత్తులు, ఎగుమతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చేనేత ఉత్పత్తుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కలెక్టర్ వివరించారు.

ఒక జిల్లా–ఒక ఉత్పత్తి అవార్డులను నవంబర్ నెలాఖరులో కేంద్ర ప్రభుత్వం ప్రకటించనుందని



ఆరాధన శర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

కలెక్టర్ తెలిపారు. జాతీయస్థాయి అవార్డు కోసం దేశవ్యాప్తంగా 540 జిల్లాల నుంచి కూడా నామినేషన్లు కేంద్రానికి వచ్చాయనన్నారు. ప్రాథమిక పరిశీలనలో దేశవ్యాప్తంగా కేవలం 64 జిల్లాలే ఎంపికయ్యాయన్నారు. అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి 14 జిల్లాలు ఎంపికైనట్లు కేంద్రం నుంచి సమాచారం వచ్చిందన్నారు. ప్రాథమిక పరిశీలనకు శ్రీకాకుళం జిల్లా ఎంపిక కావడం సంతోషదాయకమన్నారు. అవార్డు నామినేషన్ క్షేత్రస్థాయి పరిశీలన కోసం కేంద్ర బృందం జిల్లాకు వచ్చిందన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత ఒక జిల్లా–ఒక ఉత్పత్తి జాతీయ అవార్డును కేంద్ర ప్రభుత్వం నవంబర్ నెలాఖరులో ప్రకటిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పొందూరు ఖాదీ ఉత్పత్తులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, రాష్ట్ర ప్రభుత్వం నేతన్నలకు అందిస్తున్న పింఛన్, వైఎస్ఆర్ నేతన్న నేస్తం, ముడి సరుకులు, ముద్ర పథకం తదితర పథకాలు, రాయితీలు వివరించారు. వస్త్ర తయారీలో తీసుకుంటున్న నాణ్యతా ప్రమాణాలు, తయారీలో నూతన విధానాలు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పొందూరు ఖాదీ ఉత్పత్తులపై ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి నెలా మొదటి సోమవారం జిల్లాలో నిర్వహిస్తున్న స్పందన వినతుల స్వీకరణ కార్యక్రమానికి అందరూ అధికారులు విధిగా నేత వస్త్రాలు ధరించడం జరుగుతుందన్నారు. పొందూరు ఖాదీ ఉత్పత్తులపై శంకరరావు వివరించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా చేనేత, జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ కన్నబాబు, సహాయ సంచాలకులు ధర్మారావు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, డెవలప్‌మెంట్ ఆఫీసర్ శేఖర్, శ్రీను, ఏడీఓఓ రమేష్, రమణ, జిల్లాలో పలు మండలాల నుంచి నేత కార్మికులు, జిల్లా చేనేత, జౌళి శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి స్టేషన్ ఆకస్మిక తనిఖీ

మెళియాపుట్టి: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ జీఆర్ రాధిక శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరిహద్దులో నిఘా పెంచాలని సూచించారు. పలు కేసులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులు ఉండకుండా చూడాలని అన్నారు. నాటుసారా క్రయవిక్రయాలు, మత్తుపదార్థాల రవాణాపై నిఘా పెంచాలని సూచించారు. నూతన భవన నిర్మాణం కోసం సిబ్బంది విన్నవించారు. పాతపట్నం సీఐ వినోద్ బాబు, ఎస్ఐ రాజేష్, ఏఎస్ఐ నరసింగరావు, పలువురు సిబ్బంది ఉన్నారు.



మెళియాపుట్టి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ జీఆర్‌రాధిక

ముంబైలో ఎగ్జిబిషన్‌కు పొందూరు ఖాదీ కార్మికులు



ఎగ్జిబిషన్‌కు వెళ్తున్న ఖాదీ కార్మికులు

పొందూరు: ముంబైలో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న చేతి కళాకారుల ఎగ్జిబిషన్‌కు పొందూరుకు చెందిన ఆరుగురు ఖాదీ వడుకు కార్మికులు ఎంపికయ్యారు. ముంబైలో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్లోబల్ మెరిట్ టైమ్ కార్యక్రమంలో దేశంలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన చేతివృత్తి కళాకారుల ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరవుతారని కేవీఐసీ అధికారులు ఖాదీ కార్మికులకు పంపిన ఆహ్వానంలో పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కాలప చిన్నమ్మడు, కొండేటి సూర్యకాంతం, మాడుగుల కల్యాణి, బస్వా జయలక్ష్మి, వడిగి లక్ష్మి, చదువుల సుగుణావతి ముంబై బయల్దేరారు. వీరికి సహాయకులుగా ఏఎఫ్‌కేకే సంఘం కార్యదర్శి వెంకటరమణ, సంస్థ ప్రతినిధి శంకరరావులు వెళ్లారు.

అట్టాడకు ‘తెలుగు సాహితీ’ పురస్కారం



రచయిత అట్టాడ అప్పలనాయుడు

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం 2021 ఏడాదికి సాహితీ పురస్కారాలు ప్రకటించింది. జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడును నవలా ప్రక్రియలో ‘బహుళ’ రచనకు సాహితీ పురస్కారానికి ఎంపిక చేశారు. పురస్కార గ్రహీతకు రూ. 20,116లు నగదు అందజేసి సత్కరిస్తారు. సాధారణ పాఠకుల నుంచి కవులు, రచయితలు, విమర్శకులు, నాటక కర్తల నుంచి సూచనలు స్వీకరించి 2018, 2019, 2020 లో వెలువడిన పుస్తకాలు సేకరించి న్యాయనిర్ణేతలతో ఈ పురస్కారాలను ఎంపిక చేశారు. హైదరాబాద్ వర్సిటీ ప్రాంగణంలో జరిగే ప్రత్యేక ఉత్సవంలో త్వరలో ఈ పురస్కారాలు అందజేయనున్నారు.

క్లుప్తంగా

దసరాకు ప్రత్యేక బస్సు సర్వీసులు

శ్రీకాకుళం అర్బన్: దసరా పండగ సందర్భంగా శ్రీకాకుళం నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్టు శ్రీకాకుళం 2వ డిపో మేనేజర్ కేఎస్ఆర్ శర్మ తెలిపారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. శ్రీకాకుళం 1, 2వ డిపోల నుంచి ఈనెల 20 నుంచి 27వ తేదీ వరకు అదనపు బస్సు సర్వీసులను నడుపుతామని చెప్పారు. ఈనెల 20, 21 తేదీల్లో హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం నగరానికి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయబోమని స్పష్టం చేశారు. సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు.

ప్రయాణికులకు రాయితీలు

దసరా మహోత్సవాలకు ఆర్టీసీ నడుపుతున్న ప్రత్యేక బస్సుల్లో ఆర్టీసీ పలు రాయితీలను ప్రకటించిందని చెప్పారు. ప్రయాణికులు రాను, పోను టిక్కెట్ ఒకేసారి తీసుకుంటే చార్జీలో 10 శాతం రాయితీ పొందవచ్చన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ ఈ–వాలెట్ ద్వారా బుక్ చేసుకునే వారికి 5 శాతం, నలుగురు సభ్యులు (పిల్లలతో సహా) ఒకేసారి బుక్ చేసుకుంటే 5 శాతం, వయోవృద్ధులకు (60 ఏళ్లు దాటినవారు) అన్ని రకాల సర్వీసులలో 25 శాతం, డిజిటల్ ఆధార్ కార్డును ఐడీ ప్రూఫ్‌గా చూపించి ఈ రాయితీలు పొందవచ్చని తెలిపారు. టిక్కెట్లు ఆన్‌లైన్ ద్వారా గానీ, సమీపంలోని బస్ స్టేషన్‌లో గానీ, ఆర్టీసీ అధీకృత టిక్కెట్ బుకింగ్ ఏజెంట్ల వద్ద గానీ పొందవచ్చన్నారు.

పాలకొండకు 2 పల్లెవెలుగు సర్వీసులు

ఆదివారం నుంచి శ్రీకాకుళం–పాలకొండ మార్గంలో రెండు వైపుల నుంచి రెండు పల్లె వెలుగు బస్సులను ప్రయాణికుల సౌకర్యార్థం ప్రవేశ పెట్టనున్నట్లు శర్మ పేర్కొన్నారు. ఈ బస్సులు ఉదయం 6, 7.30, 9, 10.30, మధ్యాహ్నం 12, 1.45, 3.15, సాయంత్రం 4.45, 6.15, రాత్రి 8 గంటలకు తిరుగుతాయన్నారు.

'కొబ్బరికి గిట్టుబాటు ధర కల్పించాలి'

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతులతో కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆంధ్రప్రదేశ్ కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్ అన్నారు. కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని నాఫెడ్ కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరవాలని కోరారు. శ్రీకాకుళం నగరంలో సుందరయ్య భవనంలో శనివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కోనసీమ, ఉద్దానం ప్రాంతాల్లో అత్యధికంగా కొబ్బరి పంటను రైతులు సాగు చేస్తున్నారని చెప్పారు. కొబ్బరి రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రాక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం విదేశాల నుంచి కొబ్బరి ఉత్పత్తుల దిగుమతులకు అవకాశం కల్పించడం వల్ల దేశీయంగా కొబ్బరి రైతులకు కనీసం ధరలు రావడం లేదన్నారు. ప్రపంచ కొబ్బరి ఉత్పత్తిలో భారతదేశం మూడో స్థానం ఉండగా దేశంలో రాష్ట్రం 4వ స్థానంలో ఉందన్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఒక్కో కొబ్బరికాయకు రైతుకు రూ.6 నుంచి రూ.7 లు మాత్రమే ధర వస్తోందన్నారు. చెట్టు నుంచి కొబ్బరికాయలు కోసి గుట్టగా పోయడానికి ఒక్కో కాయకు రైతుకు రూ.3లకు పైగా ఖర్చు అవుతోందని తెలిపారు. రైతు చేతికి కాయకు మూడు రూపాయలకు మించి రావడం లేదని పెట్టుబడి ఖర్చులు కూడా రాక కొబ్బరి రైతులు నష్టపోవాల్సి వస్తోందన్నారు. కొబ్బరికాయలకు రాష్ట్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపజేయాలని కోరారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, బి.వాసు, చంద్రరావు, కొండయ్య, పి.భాస్కరరావు రైతు సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.



రూ.13 లక్షలకు టోకరా

శ్రీకాకుళం క్రైమ్ : టోల్ ఫ్రీ నంబర్ కోసం ఆన్‌లైన్‌లో వెతకడం, కంపెనీ ప్రతినిధి ఎవరో తెలుసుకోకుండా మాట్లాడడం, వచ్చిన సందేశంలో నిజానిజాలు తెల్సుకోకపోవడం, వారు పంపిన బ్యాంక్ అకౌంట్ కంపెనీదా కాదా అని తెలుసుకోకపోవడం .. కలగలిపి ఓ బిల్డర్‌కు రూ.13.10 లక్షలకు టోపీ పడింది. ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాల మేరకు..

నగరంలోని అఫీషియల్ కాలనీలో నివాసముంటున్న హనుమంతు కిరణ్‌కుమార్, జ్యోతిలు కొంతమంది భాగస్వాములతో కలిసి భువనేశ్వర్‌లో వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో అక్కడే నయాపల్లి ఏరియాలో అపార్ట్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ కోసం 3600 సిమెంటు బస్తాల కొనుగోలుకు ఆల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీని సంప్రదించాలనుకున్నారు. అయితే ఆ కంపెనీ టోల్‌ఫ్రీ నంబర్ కోసం ఆన్‌లైన్‌లో వెతికితే 022–66917800 అనే నంబర్ కనిపించింది. ఆ నంబర్‌కు కాల్ చేయగా అటు నుంచి మార్కెటింగ్ మేనేజర్ అమిత్‌సింగ్ అనే వ్యక్తి మరో రెండు ఫోన్ నంబర్లు ఇచ్చి మాట్లాడమన్నాడు. ఆ తర్వాత కావాల్సిన సిమెంట్ నాన్ ట్రేడింగ్ అయినందున ఇంకో ఫోన్ నంబర్ ఇచ్చి వివరాలు తెలుసుకోవాలని సూచించాడు. వారు చెప్పినట్లుగానే కిరణ్‌కుమార్ అన్ని నంబర్లకు కాల్‌చేసి మాట్లాడారు. చివరి నంబర్‌కు కాల్ చేసి మాట్లాడగా 3500 బస్తాలకు గాను రూ. 8,47,656.25 అవుతుందని, దానికి జీఎస్టీతో కలిపి రూ. 10.85 లక్షలు, ఆల్ట్రాటెక్ సిమెంట్ సంస్థ రిజిస్ట్రేషన్ కోసం మరో రూ. 2.25 లక్షలు కలిపి మొత్తంగా పంపాలని వారి లెటర్ హ్యాడ్‌తో ఇన్వాయిస్‌ను వీరి మెయిల్‌కు పంపించారు. డబ్బులు పంపించిన తర్వాత స్టాక్ పంపిస్తామన్నారు.



మెయిల్‌లో పంపిన ఇన్వాయిస్ ఇదే..

అకౌంట్ నంబర్ చూసుకోకుండానే..

సాధారణంగా వ్యాపార లావాదేవీలకు కరెంట్ అకౌంట్ వినియోగిస్తారు. కానీ ఆ ఇన్వాయిస్‌లో వచ్చిన అకౌంట్ ఓ సేవింగ్స్ అకౌంట్. దాన్ని వీరు గమనించకుండా సెప్టెంబరు 13న రూ. 6.20 లక్షలు, సెప్టెంబరు 14న రూ. 4.65లక్షలు, 15న 2.25 లక్షలు జీటీ రోడ్డు యూనియన్ బ్యాంక్ అకౌంట్ ద్వారా ఆర్టీజీఎస్ పద్ధతిలో వారి సెంట్రల్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 5413556837కు పంపించారు. మళ్లీ వారికి కాల్ చేసి సిమెంట్ డిస్పాచ్ చేయమని అడిగితే ఇంకా కొంత అమౌంట్ పంపించాలని డిమాండ్ చేశారు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన దంపతులు మాకు సిమెంటు వద్దు.. మా డబ్బులు మాకు వాపస్ చేయండి అని నిలదీయగా కొద్దిరోజుల్లో వాపసు చేస్తామని చెప్పారు. ఎప్పటికీ డబ్బు పంపకపోవడంతో వారి అకౌంట్ నంబర్‌ను వెరిఫై చేయగా ఇన్‌వాయిస్‌లో కరెంట్ అకౌంట్ నంబరు బదులు సేవింగ్ అకౌంట్ నంబర్‌ను ప్రింట్ చేసి పంపారని గుర్తించారు. దీంతో శనివారం రాత్రి ఒకటో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కన్నీటి తీరం



కిశోర్ (ఫైల్)

- నాగావళిలో మునిగి బాలుడు మృతి
- శ్రీకాకుళం బలగ తీరంలో ఘటన



ఏటి ఒడ్డున సీపీఆర్ చేస్తున్న 108 సిబ్బంది

శ్రీకాకుళం క్రైమ్: నాగావళి తీరం కన్నీటితో తడిచిపోయింది. ఎప్పుడూ నిశ్శబ్దంగా ఉండే ఆ ప్రాంతం రోదనలతో మార్మోగింది. స్నానం కోసం నదిలోకి దిగిన పదిహేనేళ్ల బాలుడు గుమ్మిలోకి జారిపోయి ప్రాణాలు కోల్పోవడంతో ఈ ప్రాంతంలో విషాదం అలముకుంది. శ్రీకాకుళంలోని బలగ భద్రమ్మగుడి సమీపంలోని నాగావళి నదిలో మునిగి వంజరాపు కిశోర్(15) శనివారం మృతి చెందాడు. రెండో పటణ సీఐ పప్పల శ్రీనివాసరావు, ఏడీఎఫ్ఓ వరప్రసాదరావు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

బలగ కుమ్మరి వీధికి చెందిన వంజరాపు దాలయ్య కు పదో తరగతి చదువుతున్న కుమారుడు కిశోర్, ఏడో తరగతి చదువుతున్న కుమార్తె ఉన్నారు. కిశోర్ స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో చదువుతున్నాడు. సెలవు రోజు కావడంతో తన మిత్రుడు చరణ్‌తో కలిసి కటింగ్ చేయించుకుని అక్కడి భద్రమ్మ గుడి సమీపంలోని నాగావళి నదికి స్నానానికి వెళ్లాడు. చరణ్‌కు ఈత రాకపోవడంతో ఒడ్డునే స్నానం చేస్తున్నాడు. కిశోర్ కూడా నదిలోకి దిగి స్నానం చేస్తుండగా.. ఒక్కసారిగా గుమ్మి ఉన్న ప్రాంతంలోకి జారిపోయాడు. దీన్ని చూసిన చరణ్ పెద్దగా కేకలు వేశాడు. అప్పటికే నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో కళ్ల ముందే కిశోర్ కొట్టుకుపోతున్నాడు. ఈ దృశ్యాన్ని అక్కడే చేపలు పడుతున్న బమ్మిడి సురేష్, పొట్నూరు జగదీష్‌లు చూసి కాపాడేందుకు చాలా ప్రయత్నించారు. అయినా ఫలితం లేకపోయింది. వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించడంతో ఏడీఎఫ్ఓ వరప్రసాదరావు తమ సిబ్బందితో కలిసి 10.15 ప్రాంతంలో రెస్క్యూ ప్రారంభించారు.



నది మధ్య బాలుడికి సీపీఆర్ చేస్తూ..

ఎల్ఎఫ్ఓ శృంగార నాయుడు, సీహెచ్‌పీ కూర్మారావు, పి.రహీమ్, ఎం.ఎ.భట్లు ఇంజిన్ బోట్‌ను ప్రమాద స్థలికి దగ్గరగా ఉంచి లైఫ్ జాకెట్లు, రోప్ (తాడులు), బోనాలు (కర్రలు) సిద్ధం చేసి స్థానికులు మరో 20 మంది ఈత వచ్చిన కుర్రాళ్లతో కలిసి నదిలోకి దిగారు. ఆ ఒడ్డుకు ఈ ఒడ్డుకు మధ్య సుమారు 75 మీటర్లు రోప్ వేసి కర్రల సాయంతో వెతికారు. గంటన్నర వెతుకులాట తర్వాత 40 అడుగుల నీటి లోతులో కర్రలకు ఏదో తగలడంతో వెంటనే ఇంజిన్ బోట్ సాయంతో శరీరాన్ని బయటకు తీసి అవతలి ఒడ్డుకు తీసుకెళ్లారు.

సీపీఆర్ చేసినా..

అప్పటికే 108కు సమాచారం అందించారు. కిశోర్ శరీరాన్ని ఒడ్డుకు తీసుకువచ్చిన వెంటనే సీపీఆర్ చేశారు. 108 సిబ్బంది కూడా వచ్చి మళ్లీ సీపీఆర్ చేసి చనిపోయాడని నిర్ధారణ చేశారు. అప్పటికే అక్కడకు చేరుకున్న కిశోర్ తల్లిదండ్రులు చలనం లేకుండా పడి ఉన్న కుమారుడి మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా రోదించారు. సీఐ శ్రీనివాసరావు ఘటనకు గల కారణాలను ఆరా తీసి వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.



జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు మన అంపైర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2023 పోటీలకు శ్రీకాకుళం జిల్లా నుంచి రికార్డు స్థాయిలో ఐదుగురు ఫిజికల్ డైరెక్టర్లు అంపైర్లు(టెక్నికల్ అఫీషియల్స్)గా నియామకమయ్యారు. ఈ పోటీలు తెలంగాణ రాష్ట్రంలోని హనుమకొండలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వేదికగా ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు జరగనున్నాయి. అంపైర్లుగా బాడాన నారాయణరావు (జెడ్పీహెచ్‌స్కూల్ చాకిపల్లి), తంగ్రాపు శ్రీనివాసరావు (జెడ్పీహెచ్‌స్కూల్ అంపోలు), సమర చంద్రశేఖర్ (జెడ్పీహెచ్‌స్కూల్ నగరంపల్లి), సయ్యద్ షాజహాన్ (జెడ్పీహెచ్‌స్కూల్ మండపల్లి), అజిత్ కుమార్ (జెడ్పీహెచ్‌స్కూల్ పెద్దశ్రీరాంపురం) నియామకమయ్యారు. ఈ పోటీల కోసం శనివారం సాయంత్రం వారు హనుమకొండ చేరుకున్నారు. శ్రీకాకుళం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ కొన్న వెంకటేశ్వరరావు (వాసు), రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, ఏపీ అథ్లెటిక్స్ జాయింట్ సెక్రటరీ నొపడ విజయ్ కుమార్, ఏపీ అథ్లెటిక్ టెక్నికల్ చైర్మన్ కె.హరిబాబు, జిల్లా పీడీ సంఘ అధ్యక్షులు ఎంవీ రమణ, జిల్లా స్కూల్ గేమ్ సెక్రటరీ బీవీ రమణ, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, డీఎస్ఏ అధికారులు, పీడీలు హర్షం వ్యక్తం చేశారు.



సౌత్‌జోన్ జాతీయ పోటీలకు అంపైర్లుగా ఎంపికైన పీడీలు

ఆదిత్యుని సన్నిధిలో బీసీ కార్పొరేషన్ జీఎం



భీమశంకరరావుకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న అర్చకులు క్షేమేంద్ర శర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ జి.భీమ శంకరరావు కుటుంబసమేతంగా శనివా రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం అధికార సిబ్బంది గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు.

అనంతరం వేదపండితులు ఆశీర్వచనాన్ని, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు బీఎస్ చక్రవర్తి తదితరులు ఉన్నారు.

ఇంటిలో కోప్పడతారని..

- భయంతో బాలుని అదృశ్యం



తప్పిపోయిన బాలుడు త్రిశూల్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రానికి చెందిన ఓ బాలుడు తాను సినిమాకు వెళ్లిన సంగతి ఇంటిలో తెలిసి కోప్పడతారని భయపడి ఎక్కడికో వెళ్లిపోయాడని రెండో పట్టణ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపారు. సీఐ చెప్పిన వివరాల మేరకు.. బైరివాని పేటలో నివాసముంటున్న సనపల గోవిందరావు, కరుణ దంపతుల కుమారుడు త్రిశూల్(13) ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులిద్దరూ పనుల మీద రోజూ బయటకు పోతుండటంతో త్రిశూల్ అతని చెల్లి దీక్షిత స్కూల్ ముగిశాక సాయంత్రం 4 గంటలకు ఇంటికి చేరి అదే వీధిలో ఉన్న పెద్దనాన్న శ్యామలరావు ఇంటికి వెళ్లేవారు. ఈ క్రమంలో ఈ నెల 12న సాయంత్రం త్రిశూల్ మరో బాలుడు డేఅండ్‌నైట్ జంక్షన్ వద్ద సివిల్ డ్రెస్‌లో శ్యామలరావుకు కనిపించారు. ఎక్కడకు వెళ్లారని ప్రశ్నిస్తే సినిమాకు వెళ్లామని బదులిచ్చారు. ఆ రోజు ఇంటికి వచ్చిన బాలుడు తాను సినిమాకు వెళ్లానని తెలిస్తే తల్లిదండ్రులు కోప్పడతారని, తాను ఆమదాలవలస వెళ్తున్నానని చెల్లి దీక్షితకు చెప్పి బయల్దేరి తిరిగి రాలేదు. అన్నయ్య ఎంతకూ రాకపోవడంతో దీక్షిత తల్లికి ఫోన్ చేసి చెప్పింది. ఆమె శ్యామలరావుకు ఫోన్‌చేసి మాట్లాడగా.. తాను సివిల్ డ్రెస్‌లో చూసిన విషయాన్ని చెప్పారు. అందరూ కలిసి బంధువుల ఇళ్లన్నీ వెతికినా ఎక్కడా ఆచూకీ దొరక్కపోవడంతో శనివారం రాత్రి రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. దీనిపై ఎస్ఐ కె.లక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీధి కుక్కల దాడిలో దుప్పి మృతి

కవిటి: మండలంలోని గొండ్యాలపుట్టుగ సమీపంలోని కొబ్బరితోటలో వీధి కుక్కల దాడిలో శుక్రవారం సాయంత్రం దుప్పి మృతి చెందినట్టు అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ రామినేని రాఘవయ్య, బీట్ ఆఫీసర్ బి.రవికుమార్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం వేళలో రైతులు తోటల నుంచి ఇంటికి వస్తున్న సందర్భంలో కుక్కల గుంపు దుప్పిని వెంబడించి చంపినట్టు స్థానిక అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి మృతి చెందిన దుప్పిని భద్రపరిచారు. శనివారం ఉదయం స్థానిక పశువైద్యశాఖ సిబ్బంది పురుషోత్తం మృతి చెందిన దుప్పికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం పుక్కళ్లపాలెంలోని వనసంరక్షణ సమితి సభ్యుల పర్యవేక్షణలో దుప్పికి దహనపరిచామని సెక్షన్ ఆఫీసర్ రామినేని రాఘవయ్య, బీట్ ఆఫీసర్ బి.రవికుమార్ తెలిపారు.



దుప్పికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న పశుసంవర్ధక సిబ్బంది, అటవీ శాఖ సిబ్బంది

గాయపడిన వ్యక్తి మృతి

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేం ఫ్లై ఓవర్ వద్ద గత నెల 17న జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి గాయపడ్డారు. ఆయనను పోలీసులు శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు వైద్యులు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతున్న ఈ వ్యక్తి శనివారం మృతి చెందాడు. వ్యక్తి వివరాలు తెలిసిన వారు 6309990816, 6309990853 నంబర్లను సంప్రదించాలని ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

విద్యుత్ షాక్‌తో ట్రాక్టర్ డ్రైవర్ మృతి



మృతుడు సూర్యనారాయణ

రణస్థలం: మండలంలోని నారువ పంచాయతీలో గల బోయపాలెం గ్రామంలో విద్యుత్ షాక్‌తో ట్రాక్టర్ డ్రైవర్ మండల సూర్యనారాయణ(38) మృతి చెందాడు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం లావేరు మండలంలోని బొంతుపేట గ్రామానికి చెందిన సూర్యనారాయణ మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటి వద్ద నుంచి రణస్థలం మండలంలోని నారువ గ్రామంలో సరుగుడు కర్రలు తీసుకువద్దామని ట్రాక్టర్‌తో బయల్దేరాడు. నారువ పంచాయతీలోని బోయపాలెంలో సరుగుడు తోటలోకి సాయంత్రం 4.30 గంటల సమయంలో వెళ్లాడు. ఆ తోటలో వేలాడుతున్న విద్యుత్ తీగలను గమనించకుండా బండిని ముందుకు నడపడంతో విద్యుత్ తీగలు ట్రాక్టర్‌కు తగిలి సూర్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ సమయంలో కూలీలంతా కింద కర్రలు ట్రాక్టర్‌లోకి వేసే పనిలో ఉన్నారు. మృతునికి తల్లిదండ్రులు అమ్మడమ్మ, తవుడు, భార్య లక్ష్మి ఇద్దరు కుమారులు ఉన్నారు. సూర్యనారాయణ మరణవార్తతో బొంతుపేట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. జేఆర్ పురం ఎస్ఐ జి.రాజేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



పీసీసీ ఉపాధ్యక్షురాలిగా బొడ్డేపల్లి

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్రంలో, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తమవంతుగా కృషిచేస్తామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి కృష్ణారావు అన్నారు. శ్రీకాకుళంలోని ఇందిరావిజ్ఞాన్‌భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అంబటి కృష్ణారావు మాట్లాడారు. ఇటీవల జరిగిన పీసీసీ సమావేశంలో జిల్లాకు చెందిన బొడ్డేపల్లి సత్యవతిని పీసీసీ ఉపాధ్యక్షురాలిగా, సనపల అన్నాజీరావు, అంబటి కృష్ణారావు, పైడి నాగభూషణరావులను పీసీసీ ప్రధాన కార్యదర్శులుగా, పేడాడ పరమేశ్వరరావును డీసీసీ అధ్యక్షునిగా నియమించారని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఏఐసీసీ, పీసీసీ ఉత్తర్వులు విడుదల చేశారన్నారు. త్వరలో 5 రాష్ట్రాలకు జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించనుందని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన తమకు రాష్ట్ర కమిటీలో చోటు కల్పించినందుకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీకి, యువనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పీసీసీ ప్రెసిడెంట్ రుద్రరాజు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.